

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘననివాళి

కోనరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ వ్యవస్థాపక సభ్యుడిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. రాజనీతిజ్ఞుడిగానే కాకుండా రాజకీయాల్లోనూ అజాత శత్రువుగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నిండుకుండలా అనంతారం ప్రాజెక్టు

మండలంలోని అనంతారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చిచేరడంతో నిండుకుండలా మారిపోయింది. ప్రాజెక్టు సామర్థ్యం 140ఎమ్‌సీఎఫ్‌టీ (0.14 టీఎంసీ) కాగా ప్రస్తుతం పూర్తిగా నిండి కొద్దిగా మత్తడి దూకుతోంది. మత్తడి దూకడం ద్వారా బిక్కవాగు ప్రవహిస్తే అనంతారం, జగంమరెడ్డిపల్లె, రహీంఖాన్‌పేట, వంతడుపుల, గాలిపల్లి, జవారిపేట, నర్సక్కపేట గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

- ఇల్లంతకుంట, ఆంధ్రజ్యోతి



ధర్మగుండంలో దుర్గంధం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ధర్మగుండం దుర్గంధం వెదజల్లుతోంది. శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీ పెరగడంతో ధర్మగుండంలోని నీరురంగు మారి దుర్వాసన వస్తోంది. దీంతో గమనించిన అధికారులు నీటిని తొలగించి నింపకుండా ధర్మగుండంలోకి నీటిని పైపుల ద్వారా వదిలారు. దీంతో రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు పైపుద్వారా వదిలిన నీటితో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మగుండం దుర్వాసన రావడంతోనే పైపుల కింద పవిత్రస్నానాలు ఆచరిస్తున్నట్లు భక్తులు వెల్లడించారు. -వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని లబ్ధిదారుడు పర్శరాములుకు మంజూరైన రూ.53 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక నాయకులు శనివారం అందజేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజు, శంకర్, బాపురెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, వెంకటరమణారెడ్డి, బాబు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున చందుర్తి గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

శుభ్రమైన శిలాఫలకం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వేములవాడ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శిలాఫలకాన్ని అధికారులు శనివారం శుభ్రం చేశారు. ఈ నెల 11వ తేదిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో శిలాఫలకాన్ని పట్టించుకోరా..? అనే కథనం ప్రచురితమైంది. రాజన్న ఆలయంలో రూ. 76 కోట్ల అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకానికి గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో న్యూస్ పేపర్‌తో కనిపించకుండా అతికించారు. ఎన్నికల కోడ్ ముగిసినా న్యూస్ పేపర్‌ను తొలగించకపోవడంతో శిలాఫలకం చిలుమెక్కింది. దీంతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు శిలాఫలకాన్ని శుభ్రపరిచారు.

సాగు లక్ష్యం నెరవేరుతోంది...



- ఇప్పటికే అంచనాకు మించి వరి సాగు
- జిల్లాలో మోస్తరుగా వర్షాలు
- ప్రాజెక్టులు..చెరువుల్లోకి వరద నీరు
- పంటలకు జీవం.. రైతులకు ఆశలు
- వానాకాలం సాగు 2.36 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రాజన్న సిరిసిల్ల జిల్లా అన్నదాతల ఆశలకు ఊపిరినిస్తున్నాయి. వ్యవసాయ శాఖ వానాకాలం సీజన్ పంటల సాగు అంచనా లక్ష్యం నెరవేరుతోంది. ఇప్పటికే అంచనాకు మించి రైతులు వరి నాట్లు వేసుకున్నారు. రోహిణి కార్తెతోనే రుతుపవనాల ఆగమనంతో వానాకాలం రైతులను ముందస్తుగా మురిపించింది. ఆ తర్వాత మోస్తారుతో పాటు చిరుజల్లులే కురిశాయి. దీంతో రైతులు ఎన్నోఆశలతో వానాకాలం సాగు పనులు ప్రారంభించారు. ఆశించిన వర్షాలు లేకపోవడంతో సాగుపై తీవ్రప్రభావం పడింది. అల్పపీడిన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో మళ్లీ పంటలపై భరోసా పెరిగింది. వరి, పత్తి ఇతర పంటల సాగు పెరిగింది. జిల్లాలో వానాకాలంలోలో 2,43,773 ఎకరాలు వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ రూపొందించింది. సీజన్ ప్రారం భంలో కొత్త ఇబ్బంది పడ్డా ప్రస్తుతం లక్ష్యం చివరి దశకు చేరుకుంది. జిల్లాలో ఇప్పటివరకు 2,36,305 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి, పత్తితో పాటు మొక్కజొన్న 3,713 ఎకరాలు, కందులు 660 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, ఇతర పంటలు 77 ఎకరాల్లో సాగు చేశారు.

జిల్లాలో ఇప్పటి వరకు వానాకాలం సాగు ఇలా..

మండలం	వరి	పత్తి	మొత్తం
గంభీరావుపేట	16,950	85	17,048
ఇల్లంతకుంట	24,000	12,000	36,970
ముస్తాబాద్	23,000	530	23,785
సిరిసిల్ల	4,700	800	5,523
తంగళ్లపల్లి	18,500	870	19,486
వీర్నపల్లి	8,000	300	8,300
ఎల్లారెడ్డిపేట	17,000	3,420	20,420
బోయినపల్లి	12,600	6,400	19,167
చందుర్తి	15,100	6,200	21,322
కోనరావుపేట	18,300	4,800	23,140
రుద్రంగి	5,910	2,200	10,964
వేములవాడ	10,200	4,800	15,038
వేములవాడ రూరల్	11,300	3,800	15,142
మొత్తం	1,85,560	46,205	2,36,305

ఆగస్టు 16 వరకు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	505.7	327.5
చందుర్తి	516.2	452.6
వేములవాడ రూరల్	490.3	446.1
బోయినపల్లి	431.5	363.9
వేములవాడ	499.0	450.4
సిరిసిల్ల	482.7	406.1
కోనరావుపేట	434.2	432.1
వీర్నపల్లి	453.9	413.7
ఎల్లారెడ్డిపేట	448.3	443.4
గంభీరావుపేట	441.5	496.8
ముస్తాబాద్	383.3	529.5
తంగళ్లపల్లి	486.7	564.2
ఇల్లంతకుంట	375.0	559.7
సగటు వర్షపాతం	457.6	452.8

చి'వరి'కి ఆశలు...

జిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక వరినాట్లు మందకొడిగా సాగాయి. రైతులు కూడా నారుమడులు సిద్ధం చేసుకున్న నాట్లు వేసుకోలేక ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత అల్పపీడనంతో కురిసిన వర్షాలు వరిసాగుపై ఆశలు పెంచాయి. వ్యవసాయ శాఖ అంచనాకు మించి వరిసాగు చేశారు. జిల్లాలో 1,84,860 ఎకరాల్లో వరి సాగు అంచనా ఉండగా ఇప్పటికే 1,85,560 ఎకరాలు సాగు చేశారు. వర్షాలు కురుస్తుండడంతో పంటలకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

తెల్ల బంగారానికి ఊపిరి..

వర్షాకాలం ప్రారంభంలోనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని భావించి పత్తి రైతులు ముందస్తుగా విత్తనాలు వేసుకున్నారు. ఆ తర్వాత వర్షాలు లేక పోవడంతో మొక్కలు వాడిపోయే దశకు చేరుకున్నా యి. రైతులు ఆవేదన చెందుతుండగా అల్పపీడనంతో వర్షాలు పడుతుండడంతో తెల్ల బంగారంగా భావించే పత్తి పంటకు ఊపిరినిస్తున్నాయి. జిల్లాలో 49,760 ఎకరాల్లో పత్తి సాగు అంచనాలకు

మిగతా 8లో

తిప్పాపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు



తిప్పాపూర్ గ్రామంలో కూలిన ఇల్లు

ఇల్లంతకుంట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి బాబు ఇల్లు కూలిపోయింది. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ ఇంటిలో నిద్రిస్తుండగా శనివారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. త్రుటిలో ఇంట్లోని వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శశికళ, ఏంపీవో శ్రీనివాస్, ఆర్ఐ సంతోష్ రమేష్ కుటుంబీకుల సభ్యులు ప్రభుత్వ పాఠశాలలో ఉండటానికి ఏర్పాట్లు చేశారు. తక్షణసాయంగా 25కిలోల బియ్యాన్ని అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇంటిని ఇప్పించడానికి కృషి..

ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి బాబు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడానికి కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొల్లవేని రమేష్ పేర్కొన్నారు. భారీవర్షాలతో ఇల్లు కూలగాశనివారం పరిశీలించారు. తక్షణసాయంగా ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసువెళ్లి, అన్నివిధాల ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జంకి తిరుపతి, నాయకులు దమ్మని లక్ష్మణ్, బోయిని రమేష్, బెజ్జంకి తిరుపతి, బెజ్జంకి రమేష్, దమ్మని బాబు, చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయితీ వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తులు

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండల వ్యవసాయ శాఖాధికారులు రాజశేఖర్, సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం రాయితీ, ఇతర రైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్, రోటవేటర్, కల్టివేటర్, బ్రష్ కట్టర్, సీడ్కం ఫర్టిలైజర్ డ్రిల్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాయితీ పొందడానికి అర్హతగల రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్, మట్టి నమూనా పరీక్షలు చేసుకుని ఉండాలని తెలిపారు. రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జతచేసి ఈ నెల 23వ తేదీలోపు సంబంధింత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్/చందుర్తి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేసిన ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలను వేములవాడ మండలం బొల్లారంలో, చందుర్తి మండల కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా జిల్లాలోని మహిళా సంఘాలకు క్యాంటిన్లు, డైరీ యూనిట్లు, కోడి పిల్లల పెంపకం యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్ ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామన్నారు. త్వరలో మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళాసంఘాల సభ్యులకు 23 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామని అందులో బాగంగా ఇప్పటికే పలు దుకాణాలను ప్రారంభించామన్నారు.



బొల్లారంలో ఎరువుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పలు దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేసి వారికి మద్దతు పల కాలని ప్రజలను విప్ ఆది శ్రీనివాస్ కోరారు. మహిళలు వ్యాపార అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మండల వ్యవసాయ శాఖ అధికారు వినీత, అనూష తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: వ్యాపార అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గంబీరావుపేట మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి కింద విజయలక్ష్మి గ్రామ సమైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయలక్ష్మణ్, డీఆర్డీవో శేషాద్రి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, తహసీల్దార్ మారుతిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కలశ యాత్రను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ప్రారంభమైన రేసంగ్ల రజ్ కలశ యాత్ర ఆదివారం జిల్లాలోకి ప్రవేశిస్తుందని యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహాసభ జిల్లా అధ్యక్షుడు తిరుపతియాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కలశ యాత్ర కరపత్రాన్ని నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతియాదవ్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా రేసంగ్ల రజ్ కలశ యాత్రను ప్రారంభించుకోగా ఆదివారం తంగళ్లపల్లి మండలం గుండా కలశ యాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. అనంతరం మహాసభ తంగళ్లపల్లి మండలం అధ్యక్షుడిగా మాసం భాస్కర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గంధం సంపత్‌యాదవ్‌ను నియమిస్తూ నియామక పత్రంను అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



8

వేములవాడలో ఉట్టి కొడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం





పై కప్పు లేక రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న బోరు బావి, తెరిచి ఉన్న విద్యుత్ స్టార్టర్ డబ్బా

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వ వార్డులో సీసీ రోడ్డు మధ్యలో పంచాయతీకి చెందిన బోరు బావి ప్రమాదకరంగా మారింది. ఎలాంటి కప్పు లేకపోవడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గమనించకుండా వెళితే చిన్నారులు అదుపు తప్పి అందులో పడిపోయి గాయాల పాలవుతున్నారు. బోరు మోటారుకు సంబంధించిన విద్యుత్తు స్టార్టర్ డబ్బా తెరచి ఉండడం వల్ల కరెంటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బోరు బావి మోటారుపై కప్పు వేయడంతో పాటు విద్యుత్ స్టార్టర్ డబ్బాను మూసి ఉంచాలని కాలనీవాసులు కోరుతున్నారు

సెల్‌ఫోన్ అప్పగింత



యజమానికి మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బలుసుల వంశీ ఇటీవల ఇరుకుల్లలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్‌ను ఉపయోగించి ఫోన్ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్ ఈద్గా వద్ద చెట్ల పొదల్లో పేకాట స్థావరంపై శనివారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారైనట్టు ఆయన తెలిపారు. చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి నిర్వహించగా 8మంది పేకాట ఆడుతున్నారని, అందులో ఐదుగురిని అరెస్టు చేయగా, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.06లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

- 75.1 శాతంతో రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా మొదటిస్థానం
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిర్మల్, పెద్దపల్లి
- ఆందోళన కలిగిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు



జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయి. గత జూలై వరకు సిజేరియన్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జగిత్యాల జిల్లా 75.1 శాతంతో మొదటి స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మల్ జిల్లా 74.1 శాతంతో ద్వితీయ స్థానంలో, పెద్దపల్లి 72.7 శాతంతో తృతీయ, హన్మకొండ 72.7 శాతంతో నాల్గవ, కరీంనగర్ 71.3 శాతంతో ఐదో స్థానంలో ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరిగిన తొలి ఐదు జిల్లాల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లు ఉండడం గమనార్హం.

జగిత్యాలలో అధికం..

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7,120 ప్రసవాలు జరగ్గా, అందులో 2,511 సాధారణ, 4,609 సిజేరియన్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,451 ప్రసవాలు జరగ్గా, అందులో 2,383 సాధారణ, 4,068 సిజేరియన్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,551 ప్రసవాలు జరగ్గా, అందులో 2,327 నార్మల్, 4,224 సిజేరియన్ ప్రసవాలున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలంలో 1,612 ప్రసవాలు జరగ్గా అందులో 422 సహజ ప్రసవాలు, 1,190 సిజేరియన్లు జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత మూడు సంవత్సరాల కాలంలో సిజేరియన్లు అధికంగా జరిగాయి.

కారణాలు అనేకం...

సాధారణ ప్రసవం చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో గర్భిణి, కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ ఉండాలి. దీని కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సి వస్తుండడంతో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ ప్రసవానికి సిద్ధపడేలా గర్భిణి, కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం కూడా చేయకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు పౌష్టికాహారం లేక రక్తహీనత కారణంగా సిజేరియన్లు జరుగుతున్నాయన్న అభిప్రాయాలున్నాయి. కొందరు శుభ ముహూర్తాలు అంటూ సిజేరియన్ చేయిస్తున్నారు. సాధారణ ప్రసవం నొప్పులను తమ కూతురు తట్టుకోలేదని కొందరు తల్లిదండ్రులు ఒత్తిడి చేయిస్తుండడంతో వైద్యులు చేసేదేమీ లేక సిజేరియన్ల వైపు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు అధికంగా జరుగుతుండడంపై ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌లు దృష్టి సారించి ప్రభుత్వ వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు పెంపొందించాలని ఆదేశించారు.

డబ్ల్యూహెచ్‌వోమార్గదర్శకాలు ఇలా...

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్లు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల్లో 71.3 శాతం మేర సిజేరియన్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో చాలా వరకు అవసరం లేకపోయినా సిజేరియన్లు చేసినట్లు అధికా రులు అనుమానిస్తున్నారు. సాధారణ ప్రసవం చేయడానికి వీల్లేని పరిస్థితుల్లోనే సిజేరియన్లు చేసినట్లు సర్కారు ఆసుపత్రుల వైద్యుల పే ర్కొంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు.

సాధారణ ప్రసవాలు పెంచేలా చర్యలు

-డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధిక శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లుగా గుర్తించాం. జూలైలో రాష్ట్రంలోనే సర్కారు ఆసుపత్రుల్లో సిజేరియన్లలో జగిత్యాల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అయితే పరిస్థితిలో మార్పు తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ వైద్యాధికారులతో ఇటీవల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహించాం. భవిష్యత్తులో సిజేరియన్లు వీలైనంత వరకు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అంగడి రాజు(ఫైల్)

వెల్గటూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దమ్మన్నపేటకు చెందిన అంగడి రాజు(26) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి రాజు జీవితంపై విరక్తిచెంది ఈనెల 14న ఎండపల్లి గ్రామ శివారులో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా మహాసభలు వాయిదా

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభలు ఆదివారం జరగాల్సి ఉండగా, భారీవర్షాల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి తేదీలు ప్రకటిస్తామని తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి



రాహుల్(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాహుల్(20) అనే యువకుడు పురుగుల మందు తాగగా వరంగల్ ఎంజీఎంలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో గుంటి చంద్రమౌళి తన వ్యవసాయ బావి వద్ద రాహుల్ ఉన్నాడని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి వెళ్లి చూడగా రాహుల్ పురుగుల మందుతాగి ఉన్నాడు. వెంటనే ద్విచక్రవాహనంపై సింగాపూర్ వరకు అక్కడినుంచి 108లో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైనచికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తన కొడుకుకు మూడురోజుల క్రితం జ్వరం రాగా సైదాపూర్‌లోని ఓ ఆర్‌ఎంపీకి చూపించామని, అతను పరీక్షలు చేసీ పస్కలు అయినట్లు తెలిపాడని తల్లి విజయ తెలిపింది. పస్కలు అయిన తనను ఆస్పత్రికి తీసుకపోతలేరని మనస్థాపం చెంది తన కొడుకు రాహుల్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొన్నాడని పేర్కొంది. తన కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా రాహుల్ తనకు ఎవరిపై కోపం లేదని తనకు జీవి తంపై విరక్తి చెందిందని, తాను సంతోషంగా చనిపో తున్నానని సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పంజాల కృష్ణ, వనం హరీష్ అనే వ్యక్తికి రూ.25లక్షలు అప్పుగా ఇచ్చాడు. కృష్ణ ఆ డబ్బులు అడిగితే హరీష్ బెదిరించాడు. దీంతో మనస్థాపానికి గురైన కృష్ణ ఈనెల 3న హైస్కూల్ గ్రౌండ్‌లో పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీశాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కృష్ణ భార్య తిరుమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కాలువలో పడి మేకల కాపరి మృతి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి మండలం దొనూర్ గ్రామానికి చెందిన మానం చంద్రయ్య (59) అనే మేకల కాపరి ప్రమాదవశాత్తు ఎస్‌ఆర్‌ఎస్‌పీ పిల్ల కాలువలో పడి శనివారం మృతి చెందాడు. చంద్రయ్య దొనూర్ గ్రామ శివారులో గల భీమన్న గుట్ట సమీపంలో మేకలు కాస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి మృతి చెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

- 12 తులాల బంగారం, కారు, రూ.15వేలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాయికల్ లలితమాత శివారులోని గుడి సమీపంలో మామిడి తోటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురువ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలపల్లికి చెందిన వనం పాపయ్య, టీఆర్‌నగర్‌కు చెందిన వనం రాము, దాసరి రవిగా పోలీసులు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన మరో నిందితుడు నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన జగన్నాథం కృష్ణ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో వీరిపై ఇప్పటికే ఆరు కేసులు నమోదైనట్లు గుర్తించారు. నిందితుల నుంచి 12 తులాల బంగారం, రూ.15వేల నగదు, 3సెల్‌ఫోన్లు, ఒకకారు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒకముఠాగా ఏర్పడి జగిత్యాల, రాయికల్, మల్యాల, భూపాలపల్లి, భద్రాచలం, పరిసర ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందని 30కి పైగా కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు డీఎస్పీతెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, రూరల్ ఎస్సై సధాకర్, రాయికల్ ఎస్ఐ సుధీర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, సుమన్‌లను డీఎస్పీ అభినందించి నగదు బహుమతి అందజేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను పెంచుతున్న కేసులో నీలం కార్తిక్(33) అనే నిందితుడిని శవారం ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. మేడిపల్లి గ్రామంలో కార్తిక్ ఇంటి పక్కన ఐదు గంజాయి మొక్కలను పెంచుతున్నాడని, మెక్కలు పెరిగిన తరువాత అమ్ముకొని డబ్బు సంపాదించాలనుకున్నాడని ఎస్ఐ ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్వర్టు పనులను అడ్డుకున్న గ్రామస్థులు



కోనరావుపేటలో కల్వర్టు పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు నిర్మాణం పనులను కోనరావుపేట గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. కల్వర్టు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చడంలేదని మండల కేంద్ర వాసులు ఆరోపిస్తున్నారు. పైపులు వేసిన తర్వాత కంకర సిమెంట్‌తో వేయాల్సి ఉండగా రౌతులు మట్టితో నింపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సందర్శించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు.

గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు



మానకొండూర్‌లో గుంతలమయంగా కరీంనగర్-వరంగల్ రోడ్డు

మానకొండూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి గుంతలమయంగా తయారైంది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో బస్సులు, లారీలు వెళ్లే సమయంలో ద్విచక్రవాహన దారులపై బురదనీరు పడుతోంది. చీకటి సమయంలో గుంతలు ఏర్పడకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



సైదాపూర్ మండలం వెన్కేపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

సైదాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘానికి శనివారం యూరియా లోడ్ వస్తున్నదని తెలుసుకొని రైతులు పెద్దఎత్తున గోదాముకు చేరుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేకుండా కవర్లు కప్పుకొని గోదామ్ ముందు యూరియా కోసం ఎదురు చూశారు. లోడ్ వచ్చిన వెంటనే రైతులను లైన్‌లో నిలబెట్టి వ్యవసాయధికారులు, సొసైటీసిబ్బంది ఒకొక్కరికి 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. లోడ్‌లో 450బస్తాల యూరియా రాగా, చివరలో లైన్ నిలబడ్డ రైతులకు యూరియా అందక పోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

- బస్తాలు సరిపోవని పంపిణీ నిలిపివేత

శంకరపట్నం: మండలంలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కాచాపూర్ సొసైటీ సిబ్బంది వచ్చిన యూరియా బస్తాల లోడ్ కంటే రైతులు ఎక్కువగా ఉన్నారని పంపిణీ నిలిపివేశారు. మరుసటి రోజు మరొకలోడ్ వస్తుందని, రైతులకు నచ్చ చెప్పడంతో అక్కడి నుంచి వారు నిరాశతో వెనుతిరిగారు.

వరకట్నం కోసం వేధించిన భర్తపై కేసు

కోనరావుపేట ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం భార్యని వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై కే ప్రశాంత్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కోనరావుపేట మండలంలోని అజ్మీర తండా గ్రామానికి చెందిన లకావత్ జ్యోతిర్మయి వివాహం 2018లో కొడిమ్యాల మండలం సూరంపేటకి చెందిన భూక్యా రమేష్‌తో జరిగింది. కొన్ని రోజుల నుంచి రమేష్ తన భార్య జ్యోతిర్మయినిఅదనంగా ఐదులక్షల రూపాయల వరకట్నం తీసుకరావాల్సిందిగా శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడు. శనివారం జ్యోతిర్మయి ఫిర్యాదు చేయడంతో రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ

- మూడేళ్లుగా పట్టించుకున్న నాథుడే లేడు
- ఇబ్బందుల్లో గ్రామప్రజలు
- గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు చేస్తున్న వైద్యసిబ్బంది

చిగురుమామిడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన పీహెచ్‌సీ భవనం అసంపూర్తిగా మిగిలింది. మండలంలో రెండో మేజర్ గ్రామ పంచాయతి అయిన బొమ్మనపల్లిలో దాదాపు 5వేల మంది జనాభా ఉంటారు. ఎక్కువశాతం ప్రజలు ప్రభుత్వం అందించే వైద్యంపైనే ఆధారపడి ఉంటారు. సంబంధిత కాంట్రాక్టరు పీహెచ్‌సీ భవనాన్ని బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశాడు. నాటి నుంచి నేటి వరకు పనులు చేయలేదు. దీంతో ఉన్న నిర్మాణం కాస్తా శిథిలావస్థకు చేరింది. వైద్య సిబ్బందికి సరైన సదుపాయాలు లేక గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఒక రూమ్‌లో విదులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పల్లే దవాఖానా సైతం ఇదే గ్రామ పంచాయతీలోనే ఏర్పాటు చేశారు. ప్రజలు వైద్యసేవలు పొందడానికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. పీహెచ్‌సీ పరిస్థితిపై అనేక సార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో చర్చకు వచ్చినా ఎలాంటి ముందడుగు పడలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెంటనే అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామప్రజలు, నాయకులు, మహిళా సంఘలు కోరుతున్నాయి.



బొమ్మనపల్లిలో అసంపూర్తిగా ఉన్న అరోగ్య ఉపకేంద్రం



గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు..

- మిట్టపల్లి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ,

గ్రామాంలో గత ప్రభుత్వ హయాంలో అరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను ఆపేశాడు. అప్పటినుంచి భవన నిర్మాణాన్ని పట్టించుకున్న వారే లేరు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాయకులు స్పందించి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వినాయక మండపాల వద్ద

డీజేలను ఉపయోగిస్తే కఠిన చర్యలు

- సరస్వతీనగర్‌లో డీజేతో నృత్యాలు.. ఒకరి బైండోవర్
- కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి



రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయకమండపాల వద్ద డీజేసౌండ్ వాడుతూ నృత్యాలు చేయటం, పాటలు పాడటం వంటిచేస్తూ వృద్ధులకు, చిన్నపిల్లలకు ఇబ్బందులను కలగిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సరస్వతీ నగర్‌లో డీజేలతో నృత్యాలు చేసి స్థానికులకు ఇబ్బంది కలిగించిన ఫిర్యాదుతో నిర్వాహకుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అధిక స్థాయిలో కాలుష్యాన్ని సృష్టించే డీజేలు, భారీ సౌండ్‌సిస్టంల వినియోగం పూర్తి నిషేదమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధిక స్థాయిలో శబ్దకాలుష్యానికి కారణమైన డీజేలు, సౌండ్ సిస్టంలు నిషేధమని, ఈ విషయంలో గణేష్ మండప నిర్వాహకులు పోలసులకు సహకరించాలన్నారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపననుంచి వినాయక నిమజ్జనం వరకు డీజేలు, మైకులు ఉప యోగించకుండా నిబంధనలు పాటించాలన్నారు. పండుగల వేళ కరీంనగర్‌రూరల్ మండలంలోని రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులను, మెసేజ్‌లు(వాట్సాప్) నమ్మకూడదన్నారు.

ఇటువంటి వదంతులను వ్యాప్తి చేస్తూ సామాజికమాధ్యమాలలో పోస్టులు పెట్టే ఏస్థాయి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద, అభ్యంతకరమైన పోస్టులు, వదంతులపై ఎవరికైనా సందేహాలు ఉంటే పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ కోరారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు



రామడుగు: గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు

- గోదావరిలో పెరిగిన ప్రవాహం
- ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

అంతర్గాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువన గల కడెం ప్రాజెక్టు, వాగులు, వంకలు ద్వారా వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కడెంప్రాజెక్టు 17గేట్లుఎత్తి లక్షా80వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. దీంతో రాత్రి 11గంటల సమయానికి ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148.00మీటర్లకు గాను ప్రస్తుతం 147.24 మీటర్లకు నీరుచేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.063టీఎంసీల నీరు నిలువ ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 2,11,817క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 2,11,817 క్యూసెక్కులు ఉండగా, హైద్రాబాద్‌మెట్రో పాలిటన్ వాటర్‌స్కీం కోసం 286క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్ హౌజ్‌కు 9,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● కడెం గేట్లు ఎత్తివేత..

కడెం రిజర్వాయర్‌కు ఉన్న18గేట్లలో 17గేట్లు తెరిచి 1,07,161 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో రాత్రి వరకు 20 గేట్లను ఎత్తి 2,01,960 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు

● నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

ధర్మారం: ఐదు రోజులుగా నంది మేడారంలోని నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రోజు ఉదయం 7-30నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు 3పంపుల ద్వారా 9450క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే మినహా అనుకున్న షెడ్యూల్‌ప్రకారం ఆదివారం వరకు ఎత్తిపోతలు కొనసాగుతాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

● గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదల

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌజ్ శనివారం మూడు పంపుల ద్వారా వర్షాకాలానికి నీటిని విడుదల చేశారు. 9450క్యూసెక్కుల నీటివిడుదల చేయగా నేరుగా మధ్యమానేరుకు తరలివెళ్తోంది. ఇప్పటివరకు రెండుటీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు తెలిపారు.



నంది పంప్‌హౌజ్ ద్వారా నీటి తరలింపు

● మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


బోయినిపల్లి : మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశ యానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం వరకు 12980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి 11,000 క్యూసెక్కులు, మూల వాగు, మానేరుద్వారా 1,332క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు డీఈరాజు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకుగాను ప్రస్తుతం 308.96మీటర్లు, నీటి నిల్వసామర్థ్యం, 27.55 టీఎంసీలకు గాను 9.850 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● ఎల్‌ఎండీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్: ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. 15వతేది రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో 16వతేది సాయంత్రానికి 1168క్యూసె క్కుల ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో ఎల్‌ఎండీలో ప్రస్తుతం నీటి నిలవు 7.252టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీ పూర్తి నీటిసామర్థ్యం 24.034 టీఎంసీలు. మిషన్‌భగీరథ, ఆవిరి రూపంలో 219 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

● కాకతీయ కాలువకు నీరు

గంగాధర: కాకతీయ కాలువకు కాళేశ్వరం నీరును విడుదల చేశారు. గాయత్రి పంపుహౌజ్ నుంచి మోటర్ల ద్వారా గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువకు నీరును విడుదల చేశారు. నాలుగు రోజుల క్రితం రెండు మోటర్లను ఆన్ చేయగా శనివారం ఐదుమోటర్లతో నీటిని దిగువకు తరలిస్తున్నారు. శనివారం ఒక్క మోటర్‌ను నిలిపేసి నాలుగు మోటర్లతో నీటిని వరద కాలువకు తరలిస్తున్నారు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు విడుదలవుతోంది. కాళేశ్వరం నీరు నాగిరెడ్డిపూర్ వరద కాలువ నుంచి రివర్స్‌గా ఎగువకు తరలుతున్నాయి. ఇదే సమయంలో ర్యాలపల్లి వద్ద వరద కాలువపై ఏర్పాటు చేసిన లింక్‌ను తెరచి కాకతీయ కాలువకు నీరును విడుదల చేశారు. 900క్యూసెక్కుల నీరు మల్యాల మండలం తాటిపెల్లి సమీపంలోని కాకతీయ కాలువ నుంచి పెద్దపల్లికి తరలిస్తున్నారు. రైతులు పంటలకు నీరు విడుదల చేయాలని కోరడంతో నీటిని కాకతీయ కాలువకు విడదల చేస్తున్నారు. గాయంత్రి పంపుల నుంచి నీరు విడుదల చేయడంతో గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, బూరుగుపల్లి, నాగిరెడ్డిపూర్, కురిక్యాల, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. అరకొర వర్షాలతో ఆగమైన రైతులు వరద కాలువకు నీరు విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ర్యాలపల్లి వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు తరలుతున్న నీరు

● ధర్మపురి వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి

● కడెం ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి నీరు విడుదల



ధర్మపురి దిగువ భాగంలో రాయపట్నం వైపు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో శనివారం గోదావరి నది ఉగ్ర రూపం దాల్చింది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరిలో నీరు చేరుతోంది. నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో కడెం ప్రాజెక్టు సంబంధించిన 17 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగి ఉధృతంగా మారింది. రాయపట్నం పాత వంతెన నీటిలో మునిగి పోవటంతో అటు వైపు ప్రజలను వెళ్లనీయకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

శ్రీరాంసాగర్‌కు అత్యధికంగా వరద

- ప్రాజెక్టులోకి 1,04,879 క్యూసెక్కుల వరద
- ఒక్క రోజులో ఏడు టీఎంసీల నీరు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుత సీజన్‌లో అత్యధికంగా వరద నీరు వస్తోంది. శనివారం ఉదయం 89 క్యూసెక్కులకు పైగా వచ్చిన వరద, సాయంత్రం వరకు కొంత పెరిగి సుమారు 1,29,393 క్యూసెక్కుల వరకు వస్తోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో డ్యామ్‌లో సుమారు ఏడు టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివాహక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 56.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 48.071 టీఎంసీల నీరు ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 46.930 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 8.937 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

● గోదావరి పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఎస్పీ ఈఈ చక్రపాణి ఒక ప్రకటనలో కోరారు. పశువులు, గొర్రెల కాపర్లు, చేపలు పట్టే వారు, రైతులు, సామాన్య జనం గోదావరి దాటే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారి ఉద్భవి

ఆలయాల్లో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రావణసందడి నెలకొంది. శనివారం లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు యమధర్మరాజు ఆలయం వద్దగండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, సోదరుడు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ప్రతినిధి బిగాల మహేష్‌గుప్తా శనివారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవోసంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఉపప్రధానఅర్చకులు నేరెళ్లశ్రీనివాసా చార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి,రమణాచార్య, నంబినరసింహమూర్తి, ద్యావళ్లవిశ్వనాథశర్మ పాల్గొన్నారు.



ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. శ్రావణ మాసం కావడంతో భక్తులు అంజన్నసన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతర పూజలు చేశారు. వేకువజాము నుంచి వర్షం కురియడంతో భక్తులకు ఇబ్బందులు పడ్డారు.



కొండగట్టు ఆలయంలో భక్తులు

యూటర్న్ ఏర్పాటు చేయాలి



బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

శంకరపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని పంచాయతీ ముందు ప్రజల సౌకర్యార్థం యూటర్న్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ డ్రైవింగ్.. యమ డేంజర్

- మ్యూజిక్ వింటూ బైక్స్ నడుపుతున్న యువత
- అతివేగంతో రెప్పపాటులో ప్రమాదం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపుతున్న సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏకగ్రతతో డ్రైవింగ్ చేస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చు. అయితే ఏ వాహన చోదకుడిని చూసినా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కనిపిస్తుంది. ఇంకొందరు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మ్యూజిక్ జోష్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా యి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వల్ల ఏకాగ్రత లోపించి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. రాజన్న సరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 2024లో ఇప్పటి వరకు 288 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 85మంది మృతిచెందగా 299మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది ఏడు నెలల్లో దాదాపు 212 రోడ్డు ప్రమా దాలు చోటుచేసుకోగా 40మందికి పైగా మృతిచెందారు. 162 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఇందులో సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనం డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడిన వారు అనేకమంది ఉన్నారు.

● ఇయర్ ఫోన్‌లో సంగీతం వింటూ..

యువత ఇయర్‌ఫోన్‌ల ద్వారా మ్యూజిక్ వినే జోష్‌లో ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. యువతను హోరెత్తించే రాకింగ్ మ్యూజిక్, మైమరిపించే పాటలు, ఎక్కువ డెసిబెల్స్‌లో శబ్దాలతో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని రోడ్డుపై వాహనాలు నడుపుతూ వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఇటీవల కాలంగా వాయిస్ క్యాన్సలేషన్ ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకం పెరిగింది. వీటి ద్వారా బయట శబ్దాలు అసలు వినిపించవు. ఈ తరహా ఇయర్‌ఫోన్లు వాడుతూ రోడ్డు దాటడం, డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరం. మనచుట్టుపక్కన శబ్దాలు వినిపించక ప్రమాదాలు పొంచి ఉంటాయి. మరోవైపు ఇతరుల ప్రాణాలు పోవడానికి కారకులవుతున్నారు. చాలామంది వాహన చోదకులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటూ వాహనాలను నడుపుతున్నారు. ద్విచక్రవాహనదారులే కాకుండా ఆటోలు, కార్లలో పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ డ్రైవింగ్‌చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.



వాహనాలను తనిఖీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

● సెల్ హెల్మెట్‌లో పెట్టి మాట్లాడటం..


హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు మూలమవుతున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే చాలా మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని ఇతరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. హెల్మెట్‌లోపల చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకోవడంతో పక్కనుంచి వచ్చే వాహనాల హారన్ వినడ పడక ప్రమాదాల బారిన పడుతున్నారు. పక్కన వచ్చే వాహనదారులతో గొడవకు దిగి బావోద్వేగానికి లోనైతే డ్రైవింగ్ మీద దృష్టిని మరల్చుతుంది. మరోవైపు మెడ వంచి చెవికి, భూజానికి మధ్యన సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపడం సాధారణమైపోయింది. ఈ విధమైన డ్రైవింగ్ ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. కొందరు ఫోన్‌లు పట్టుకొని మెస్సెజెస్,చాటింగ్ చేస్తూ డ్రైవ్‌చేస్తుంటారు. మరోవైపు తింటూ డ్రైవ్ చేయడం, డ్రైవ్‌చేస్తూ సెల్ఫీ తీసుకోవడం ప్రమాదమని భావించాలి.

● డ్రైవింగ్‌పై దృష్టిపెడితే క్షేమంగా గమ్యం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యం చేరాలంటే డ్రైవింగ్‌పై ఏకాగ్రత అవసరం, చాలామంది సెల్‌ఫోన్ డ్రైవింగ్ పెద్ద తప్పుకాదులే అనుకుంటారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కి సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్‌చేయడం ఏమి తీసిపోదని పోలీసులు వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడననే నియమం పెట్టుకోవాలని చెపుతున్నారు. క్షేమంగా గమ్యం చేరాలి.. ఇతరులు క్షేమంగా గమ్యం చేరేలా వాహనాదారులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు విస్తృత తనిఖీలు

- మహేశ్ బి. గీతే , ఎస్పీ , రాజన్న సిరిసిల్ల



రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు చేపట్టాం. ప్రతి శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయి. డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత వాహనాలపై అతివేగంగా వెలుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్‌లకు వాహనం ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తాం. వాహనాలు నడుపుతుండగా సెల్‌ఫోన్ మాట్లాడవద్దు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

- వర్షంలోనూ రాజన్న దర్శనం కోసం బారులు
- ఆలయంలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణమాసం రద్దీ కొనసాగుతోంది. శనివారం ఉదయం వర్షంలోను భక్తులు రాజన్న ఆలయానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

● ఘనంగా గోకులాష్టమి వేడుకలు..

గోకులాష్టమి సందర్భంగా ఉదయం 6.30గంటలకు అర్చకులు అన్ని వైష్ణవ దేవాలయాల్లో అబిషేకము, అర్చనలను ఘనంగా నిర్వహించారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో మహాపూజ చేపట్టారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ఉట్లు కొట్టుట, డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయఈవో రాధాబాయి, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు తదితరులు హాజరయ్యారు. వేములవాడ పట్టణంలోని యాదవ్ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. యువకులు పెద్దసంఖ్యలో హాజరై ఉట్టికొట్టుటలో ఉత్సహంగా పాల్గొన్నారు.



ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




కోనారావుపేట మండలం ధర్మారంలో వేడుకల్లో పాల్గొన్న యాదవ సంఘం సభ్యులు, రుద్రంగిలో చిన్ని కృష్ణులు, గోపికల వేశధారణలో చిన్నారులు



రుద్రంగిలో ఉట్టి కొడుతున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లో యువజన, యాదవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని జరిపించారు. పలువురు చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువజన , యాదవ, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శుభోదయం గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో కరస్పాండెంట్ ఎం శ్రీనివాస్ యాదవ్ పండుగ గూర్చి విద్యార్థులకు వివరించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో ఉట్టి కొట్టారు, కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి పద్మశ్రీ, ప్రగతి పాఠశాల ఇన్‌చార్జి లావణ్య, ఆకాడమిక్ ఇన్‌చార్జి సాయిప్రియ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట/చందుర్తి: మండల కేంద్రంలో యాదవ సంఘం అద్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడకలు కన్నుల పండువగా జరిగాయి.

కోనరావుపేట: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చిన్నారులు కృష్ణుడు, గోపికలు వేశధారణలతో అలరించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్స్ హరినాద్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ చౌరస్తా, లక్ష్మీవేంకటేశ్వర ఆలయ చౌరస్తా, శాంతినగర్ చౌరస్తాతో పాటు పలు వార్డుల ప్రధాన కూడల్లో స్థానికులు కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా యువకులు ఉట్టి కొట్టి సంబరాలను జరుపుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు రాధ, గోపికల వేషధారణలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



తంగళ్లపల్లిలో..

దివ్యాంగుల పెట్రోల్ బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు, ప్రజలు దివ్యాంగుల పెట్రోల్ బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్ దగ్గర దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న దివ్యాంగులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్‌ను మరింత ముందుకు తీసుకుని వెళ్లడానికి, టర్నోవర్ పెంచడానికి అన్ని ప్రభుత్వ వాహనాలను ఇక్కడే డీజిల్, పెట్రోల్ పోయించుకునేలా చూడాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంను అదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు వాహనాలు, వ్యక్తిగత వాహనాలు ఇక్కడ లభించే నాణ్యమైన డీజిల్, పెట్రోల్‌ను తీసుకుని దివ్యాంగులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దూర్ శివారులోని దివ్యాంగుల పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతన భవనంలోకి మార్చాలి..

ఎల్లారెడ్డిపేట: పురాతన పాఠశాల భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని వసతులు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ముఖ గుర్తింపు హాజరు పని తీరుపై ఆరా తీశారు. ఇరుకైన గదుల్లో కాకుండా కొత్త భవనంలోకి కేంద్రాన్ని మార్చాలని అన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు నాణ్యమైన భోజ నం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నా రు. ఆయన వెంట డీఆర్డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, అంగన్‌వాడీ టీచర్ పద్మ, తదితరులు ఉన్నారు.

అవయవ దానానికి అంగీకారం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తన మరణాంతరం అవయవాలను దానం చేసేందుకు మండల కేంద్రంలోని సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ ముందుకు వచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్‌కు శుక్రవారం తన అంగీకార పత్రాన్ని అందజేశారు. అవయవదానం చేయడానికి ముందుకు వచ్చిన రమేశ్‌ను పలువురు అబినందించారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ఇల్లంతకుంట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సొల్లు శేఖర్‌ను పార్టీ నాయకులు పరామర్శించారు. శేఖర్ తల్లి ఇటీవలే మృతిచెందగా కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, సంజీవ్, రామస్వామి, ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

ఆవు దూడకు బారసాల



బారసాల నిర్వహిస్తున్న నరసయ్య కుటుంబసభ్యులు

బోయినపల్లి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాళ్లు గోమాతనే తమ ఇంటి లక్ష్మీదేవిగా భావించారు.. ఆవుకు జన్మించిన దూడకు బారసార చేసి.. సాంబ అంటూ నామకరణం చేశారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన సుంకపాక నరసయ్యకు చెందిన ఆవు 21 రోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. దీంతో నరసయ్య దంపతులు సమీప బంధువులతో కలిసి బారసాల శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకున్నారు. గొమాతను తమ కుటుంబ సభ్యులతో సమానంగానే చూస్తామని అందులో భాగంగానే దూడకు బారసాల నిర్వహించామని నరసయ్య దంపతులు తెలిపారు.

అబద్ధాలు మాట్లాడుతున్న సీఎం

రామడుగు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు రోజున మూడు రంగుల జెండా సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గాయత్రి పంపుహౌజ్‌ను ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన గాయత్రి పంపుహౌజ్ జలకళతో నిండుగా ఉండటాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చూపించాలనే హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చినట్లు వినోద్‌కుమార్ తెలిపా రు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష కోట్ల విలువైన పలు ప్రాజెక్టులన్నీ గోదావరిలో కొట్టుకు పోయాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రధాన ప్రాజెక్టు కింద ఉన్న మిడ్ మానేరు, లోయర్ మానేరు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులకు నీళ్లు నింపితే నిండుగా జలకళతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

జోరువానకు రోడ్లు చిత్తడి



గుడి చెరువు కట్ట నుంచి వస్తున్న వరద నీరు



రోడ్డుపై పారుతున్న వరద నీరు

వేములవాడ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన జోరు వానకు రోడ్లు చిత్తడిగా మారిపోయాయి. పట్టణంలోని బ్రిడ్జి దాటి రెండో బ్రిడ్జికి వస్తున్న రోడ్డులో శ్రీసిద్ది వినాయక టెంపుల్ వద్ద రోడ్డు గుంతపడి నీళ్లు నిండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురువుతున్నారు. వృద్ధ దంపతులు ద్విచక్రవాహనంపై గురువారం వెళ్తూ గుంతలో పడి గాయాలపాలయ్యారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చే గుడి చెరువులోని పార్కింగ్ స్థలం గుంతలతో బురదమయంగా మారింది. గుడిచెరువులోని నీరు కట్ట నుంచి కిందకు రావడంతో జాత్ర గ్రౌండుకు వెళ్లే రోడ్డుపై నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. అధికారులు గుంతలను పూడ్చి వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



సిద్ది వినాయక గుడివద్ద గుంతలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారిన రోడ్డు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గంభీరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజ్ఞాన విద్యాలయం హైస్కూల్‌కు చెందిన 2008-2009 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసు కుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.



ప్రజా సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి రైతువేదికలో 41మంది లబ్ధిదారులకు 14లక్షల 17 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీటవేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే ప్రభుత్వం అని, ఆనాడు మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రైతు రుణమాఫీ చేస్తే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామన్నారు.

ఎరువుల వాటా పంపడం లేదు..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సిన ఎరువుల వాటా పంపడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా మన్‌కీ బాత్‌లో ఎకరానికి ఒక బస్తా ఎరువులు వాడాలని చెప్పారన్నారు. కానీ కిందిస్థాయి నాయకులు ఎరువులు ఏవి అంటున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ ఎరువుల పంపిణీలో ఇబ్బంది ఉన్నా అధిగమించే ప్రయత్నం చేస్తామన్నారు. కొందరు రైతులను అడ్డుపెట్టుకొని వ్యక్తిగత మైలేజ్ పెంచుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. రైతుల పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. యూరియాను కేంద్ర ప్రభుత్వం అనుకున్న దానికంటే తక్కువ సరఫరా చేయడంతో ఇబ్బంది తలెత్తుతోందన్నారు. అయినా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఏక్కడ ఇబ్బంది లేకుండా చూస్తున్నారని, రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు.



చెక్కును పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

- చందుర్తి మండల అభివృద్ధికి కృషి

రాజకీయంగా జన్మనిచ్చిన చందుర్తి మండల అభివృద్ధికి కృషి చేస్తానని విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. చందుర్తి మోత్కూరావుపేట రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయని ప్రస్తుతం ఏడు కోట్ల నిధుల ఉన్నాయని, మరో 10 కోట్లు నిధులు అవసరం ఉందని తెలిపారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని వివరించారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రతిపక్ష నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెల్కల తిరుపతి, వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు చింతపంటి రామస్వామి, గొట్టె ప్రభాకర్, పులి సత్తయ్య, గణేష్ పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకులుగా తీర్చిదిద్దేందుకు కృషి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, బూత్‌స్థాయిలో సమర్థవంతమైన కాంగ్రెస్ నాయకులను తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్‌జీ పీఎస్) కృషి చేస్తుందని జాతీయ సమన్వయకర్త ఇమామ్ హసన్ అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో సంఘటన్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, గ్రామీణుల సమస్యల పరిష్కారం, పంచాయతీరాజ్ వ్యవస్థ, పార్టీ బలోపేతం వంటి వాటి కోసం సంఘటన స్థాపించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో లభించే ఇసుక, గనులు, నీరు వంటి భౌగోళిక వనరుల వినియోగం, వాటి రక్షణ, పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురాగలిగిన ప్రతిభ ఉన్న నాయకులను వెతకడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

'సాగు' లక్ష్యం.. నెరవేరుతోంది

(5వ పేజీ తరువాయి)

గాను ఇప్పటి వరకు 46,205 ఎకరాల్లో సాగు చేశారు. రైతులు కలుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.

● ప్రాజెక్టులకు జలకళ..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పలు ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు మోస్తారుగా వర్షం కురిసింది. శనివారం ఉదయం వరకు సగటు వర్షపాతం 16.0 మిల్లీమీటర్లు నమోదయింది. శనివారం మధ్యాహ్నం వరకు వర్షం పడింది. మళ్లీ పొడి వాతావరణమే ఏర్పడింది. జిల్లాలో రుద్రంగి, చందుర్తి మండలంలో 18.3 మిల్లీమీటర్లు, వేములవాడలో 17.8 మిల్లీమీటర్లు, బోయిన్‌పల్లిలో 15.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 15.3 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 15.0 మిల్లీ మీటర్లు, వీర్నపల్లిలో 13.5, సిరిసిల్లలో 12.5 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 11.5 మిల్లీమీటర్లు, వేముల వాడ రూరల్‌లో 9.5 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 8.8, తంగళ్లపల్లిలో 8.0 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 7.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని శ్రీరాజ రాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దీనికి తోడుగా సిరిసిల్ల మానేరు, వేములవాడ మూల వాగుల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.55 టీఎంసీలు ఉండగా 9.718 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా 12,000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. మానేరు మూల వాగుల నుంచి 9,450 క్యూసెక్కుల నీరు వస్తోంది. అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 30 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. 3.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 1.34టీఎంసీల నీరు ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టులో 2.0 టీఎంసీలకు గాను 1.34 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 925 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

ఎడతెరిపిలేని ముసురు.. పత్తి చేనులో వరద నీరు



మూడపల్లిలో పత్తి చేనులోకి చేరిన వరద నీరు

చందుర్తి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన వర్షం శనివారం కూడా కొనసాగింది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మండలంలోని వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువుల్లోకి నీరు చేరింది. పలుచోట్ల చెక్‌డ్యాంలు, కుంటలు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. పత్తి, పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

రేపు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా



సిరిసిల్లలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన త్రిఫ్ట్ పొదుపు పథకంలో డబ్బులను కట్టిన కార్మికులకు తిరిగి చెల్లించాలంటూ సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట సోమవారం కార్మికులతో ధర్నా చేస్తామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికులు మూడు సంవత్సరాల నుంచి డబ్బులు కడుతున్నారని పథకం కాలపరిమితి అయిపోయిందన్నారు. కానీ ప్రభుత్వం పొదుపు డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదన్నారు. చేనేత జౌళీశాఖ అధికారులు మే నెలలోనే కార్మికులకు త్రిఫ్ట్ పథకం డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారన్నారు. ఇప్పటి వరకు కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు రావాల్సిన త్రిఫ్ట్ పథకం డబ్బులు వెంటనే వారి ఖాతాలల్లో జమ చేయాలని కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు మరమగ్గాల పరిశ్రమలతోపాటు అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని, ఆసాములు, కండెటు చుట్టేవాళ్లు, జాఫర్ వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలని రమేష్ కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నక్క దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ భజన మండలి సభ్యుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కళాకారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని అనంతారం గ్రామ రాదాకృష్ణ భజన మండలి సభ్యులు ప్రతిభ కనబర్చారు. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని కళాభారతిలో సకలకళల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతారం గ్రామానికి చెందిన చిన్నారులు రాధాకృష్ణ భజనలో ప్రతిభకనబర్చి ప్రథమస్థానంలో నిలిచారు. ఈసందర్భంగా సుడాచైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. చిన్నారులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు వికృతి రవీందర్, గరిగె లక్ష్మన్, అక్కెం ఎల్లయ్య, కుమ్మరవేని సత్యనారాయణలతో పాటు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రాజేందర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, లింగార్చాన, స్వామి వారికి చందనాబిషేకం, తదితర కార్యక్రమాలను జరిపించారు.భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నారాయణపూర్‌లో ఆలయానికి స్థానికుడు ఓర్సు రాజేందర్ రూ.10 వేల విలువైన సౌండ్ సిస్టంను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని అటవీ ప్రాంత శివారులోని గట్టు పెరుమాళ్ల హనుమాన్ ఆలయంలో శ్రావణ మాసం ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి బాస్కర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. భక్తులు శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్కల తిరుపతి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్, నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్యం, చింతపంటి రామస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాశెట్టి నాగరాజు,కత్తి శంకర్,మోతే బాబు, మర్రి మల్లేశం, పిట్టల బాబు, అయిరినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.